అతీతుడు

శ్రీ కొమ్మూరి వేణుగోపాలరావు

ఎప్పటిలాగా ఎర్రనిసంధ్య పడమటిదిక్కున కాలుతూ వుండే సమయానికి, యథావిధిగా అచ్యుతరావు ముస్తాబు చేసుకుని వాహ్యాళికి బయలుదేరాడు.

గేటువరకూ వచ్చాక వెనకనుంచి పిలుపు వినబడి తలత్రిప్పి చూశాడు. వంటవాడు పరమేశం చేయెత్తి పిలుస్తూన్న వాడల్లా వినయవిధేయతలతో "ఈ పూటకు ఏం చేయమంటారు బాబూ?" అని ప్రశ్నించాడు.

తను గేటు దాటబోయే సమయం వరకూ యీ సంగతి వంటవాడికి ఎందుచేత గుర్తుకురాదో అర్థంకాదు అచ్యుతరావుకు. విసుక్కుంటూ బదులు చెప్పి బయటకు వచ్చేశాడు.

ఎదురుగా రోజూ జరిగే నిత్యకృత్యం మరొకటి జరుగుతోంది కొంచెం ఎత్తులో.

ఆ ఎదుటింటి మేడమీద ఎడంవైపు గది కిటికీ తలుపులు తెరుచుకున్నాయి. రిటైరయిన గజెటెడ్ ఆఫీసరు పర్వతాలనాయుడు ఆ కిటికీ చువ్వల సందుల లోంచి ఒకమూలగా పశ్చిమాద్రికేసి చూస్తూ, చుట్ట పొగ వదులుతూ తనలో తాను ఆనందం అనుభవిస్తు న్నాడు.

ఒకవేళ అచ్యుతరావు ఆగమనాన్ని అతను పసి గట్టినట్లయితే "చూశారా యీ ప్రకృతిసౌందర్యం. ఈ గోరీలవంటి మేడలమీద నుంచి, సిటీలోని యీకుటిల వాతావరణాన్ని అమాయికంగా మభ్యపరుస్తూన్న మృదువయిన అందం, ఆహా" అంటాడు.

తనకు చిరాకు కలుగుతుంది.

కాని యిది అప్పుడప్పుడు మాత్రమే జరిగే సంగతే కాబట్టి, యివాళ జరగటం సంభవించక పోగా అచ్యుతరావు సంతోషిస్తూ ఆ వీధిదాటి బజారులోకి వచ్చాడు.

రోడ్డునున్న బురదకు అతడి పంచె అంచు కొంచం తడిసింది. వానవస్తే ఎంత మంచిబట్టలు వేసుకున్నా ఏం లాభం? అయినా యీవూరి రోడ్లు మంచివి కాబట్టి కొంతవరకూ ఫరవాలేదు. అచ్యుతరావుకు రెయిన్‌కోటు వేసుకోవటమంటే అసహ్యం. అది వేసుకున్న వాడు మిలిటరీ వాడిలాగా వుంటాడని అతని అభిప్రాయం.

ఈలోగా సైకిలుమీద ఒక యువకుడు తన శక్తి సామర్థ్యాల నుపయోగిస్తూ, వాయువేగంతో వచ్చి, మరీ ఫుట్‌పాత్ మీద నడిస్తే బురద అంటుతుందన్న భయంతో కొంచం యివతలగా నడుస్తూన్న అచ్యుత రావును యించుమించు గుద్దినంత పనిచేసి, ఒక్క భుజం రాపుడుతో మట్టుకు పోనిచ్చి, ఏమీ జరగనట్లు దూసుకు పోయాడు.

అచ్యుతరావుకు కోపం వచ్చి "వీళ్ళని అర్జంటు గాళ్ళని పిలవొచ్చు" ననుకున్నాడు. ఈ మాదిరి యువకులున్న లోకంమీద తాను చీదరించుకోకుండా ఎలా వూరుకోగలడు? అసలు యిటువంటి అబ్బాయిల్ని చూసుకుని "మా అల్లుడు" అని ఎట్లా గర్వపడుతూ చెప్పుకుంటారో పిల్లల నిచ్చిన మామలు?

క్రమక్రమంగా అతను నడుస్తూన్న కొద్దీ అను దినం చూడటానికి అలవాటుపడిన కొన్ని క్రియలు జరిగి పోయినాయి. జింకపిల్ల కారున్న యింటిముందు పడు కుని ఆలోచిస్తోంది. తనని యిలా నిర్దయగా కట్టి పడ వేసిన మనుషుల్ని గురించి గావును. తన యింట్లో పనిచేసే యాదమ్మ కొడుకువెంకటి తోటి పిల్లలతో చేరి ఒక సందులో గోలీకాయలు ఆడుతూ తనని చూసి భయంతో మూలకు నక్కాడు. పార్వతి అనే పన్నెం డేళ్ళ పిల్ల అతన్ని చూసి నవ్వుతూ సిగ్గుతో లోపలకు పోయింది.

కొన్ని రోజుల క్రితం ఒక ఆదివారంనాడు గావును ఆ పిల్లను చూశాక 'యింకో కొన్ని సంవత్స రాలు పోతే యీ పిల్ల అందానికి పట్టపగ్గాలు వుండవు" అనిపించింది. సరదాగా మాట్లాడాలనిపిం

చింది. ప్రక్కింటివాళ్ళ నడిగి గులాబీ పూలు తెచ్చు కుంటూన్నట్లుంది. గులాబీపూలంటే తనకు ఇష్టమే.

"అమ్మాయ్! నాకో గులాబీపూ విస్యావూ?" అని అడిగాడు.

ఆ అమ్మాయి మాట్లాడకుండా ఓ పువ్వు అందిచ్చి తన విశాల నేత్రాలను విప్పి ఆశ్చర్యంగా చూస్తూ నిల బడ్డది.

"నీ పేరు?"

"పార్వతి"

అచ్యుతరావు "నన్ను పెళ్లి చేసుకుంటావా?" అని అడిగాడు సరదాగా, భుజా లెగుర వేసి.

ఒక క్షణం అతని ముఖంవంక తేరిపార చూసి "మా అమ్మతో చెబుతానుండు" అని ఆ అమ్మాయి తుర్రున లోపలకు పరిగెత్తింది.

అచ్యుతరావు సిగ్గుపడి గబగబ ముందుకు సాగి, ఒక నిమిషం గడిచాక వెనుదిరిగి చూశాడు. ఆ పిల్ల ఆశ్చ ర్యంగా ఓ నడివయసు స్త్రీతో ఏమిటో చేతులు త్రిప్పుతూ చెబుతోంది. ఆమె చిన్నగా నవ్వుతోంది. తలత్రిప్పేసుకున్నాడు.

తను సాధారణంగా యిలా మాట్లాడడే. ఈ మధురమైన అనుభవంతో అతని శరీరం పులకరించింది. తన వయస్సు ముప్ఫయికూడా దాటుతోంది. కాని...

అప్పటి నుంచీ తాను ఎప్పుడు కనుపించినా ఆ పిల్ల తుర్రున లోపలకు పారిపోతుంది. ఇది పరిపాటి అయింది; తను సిగ్గుతో నవ్వుకోవటం కూడా.

అందంగా, ఒకే క్రమంలో కట్టబడిన క్వార్టర్స్ని దాటుతున్నాడు. అవి కట్టబడింది శాసనసభా సభ్యుల కోసం. కాని అవి వాళ్ళ బంధువులకూ, స్నేహితులకూ ఆలవాలమైపోయాయి. ఒకచోట సినిమా కంపెనీ కూడా వుంది. అతనికి చప్పున ఒక సత్యం స్ఫురించింది. ఒకడి కోసం ఒకడు తంటాలు పడటం యీ జగన్నాటక మాయాలీలలో ఒకటి.

"కహాఁజానే?" అన్నాడు రిక్షావాడు ప్రక్కకు వచ్చి రథాన్ని ఆపుతూ.

అచ్యుతరావుకు యిక్కడ చాలా రోజుల నుంచీ వుంటున్నా ఉర్దూ సరిగ్గా రాదు. కాని అవసరంవస్తే 'నై' అనీ, 'జావ్' అనీ అనగలడు.

ఇప్పుడు ఆగ్రహంతో "నై. జావ్" అన్నాడు.

"బస్ కిరాయివ్వండి సాబ్. దించేస్తా"

ఆ దారిన బస్సు ఏమీ లేకపోయినా వాడలానే అంటాడు. అచ్యుతరావు వినిపించుకోకుండా వెళ్ళిపో సాగాడు.

రిక్షాలలో తిరిగే మనుష్యుల్ని చూస్తే అతనికి తెగనిమంట. ఈ భారతీయులు యితర దేశస్థులు కత్తు లతో, ఫోర్కులతో తిండి తింటే దేముడిచ్చిన చేతు లుండగా అవన్నీ ఎందుకని ఎగతాళి చేస్తారు గాని దేముడిచ్చిన కాళ్లు వుండగా ఒక మనిషి తొక్కే బండిలో సిగ్గూ, లజ్జా విడచి ఎలా కూర్చోగలుగు తారో అనూహ్యం. అబ్బ! ఈ ఊళ్లో మరీను. అయి దారుగురు గుమికూడి ఒక రిక్షాలో యిరుక్కుంటారు. ఒకళ్లి మీద ఒకళ్ళు. ఒకళ్ళ క్రింద ఒకళ్లు. మొన్న యిద్దరాడవాళ్ళ మధ్య ఒక మొగవాడు జాగా లేకుం డానే కూర్చోవటం చూసి "ఛీ" అని ఏవగించు కున్నాడు. యువతులు కూర్చునే విధానం చూసి తీరాలి. ఈమధ్య ఓ క్రొత్త భంగిమ నేర్చుకున్నారు; ఓ వైపు కటిప్రదేశమూ, రెండోవైపు పిమ్మాలగా కాళ్ళు వుంచి వయ్యారమనుకుంటూ రిక్షా అంతా ఆక్రమించుకుంటారు.

ఇలా ఆలోచించుకుంటూ సందడిగా, రక రకాల మనుషులతో కూడివున్న ఓ బజారులోకి వచ్చి పడ్డాడు. ఏక్ సవారీ, దోసవారీ, దువ్వనా, తీన్ అణా లతో మ్రోగిపోతుంది ఆ ప్రదేశం గజిబిజిగా. చచ్చే యిరుకు.

"సుల్తాన్‌బజారు ఎందులకు ప్రసిద్ధిరా?" అని ఓ గురువుగారు శిష్యుల్ని ప్రశ్న వేస్తే

"సీతాకోక చిలుకలకు" అని జవాబు.

"మరియు?"

"గండుతుమ్మెదలకు".

ఈలోకంలో కొంతమంది రాజకీయవేత్తలుగా, కొంతమంది సినిమాతారలుగా, కవులుగా, కథకులుగా, చిత్రకారులుగా, మేధాసంపన్నులుగా పైకివస్తారు. కొంతమంది రౌడీలుగా పేరుతెచ్చుకున్న వాళ్ళూ వున్నారు. అలానే "సుల్తాన్‌బజారు ఫేమస్" అని పేరుతెచ్చుకున్న వాళ్ళూ అనేకులు. ఓహో! ఈ సృష్టిలో పేరుగలవాళ్లు ఎంతమంది వున్నారు!

అసలు యిది కలగాపులగంగావున్న ప్రదేశం. చార్మినార్ దాటి వెడితే అరేబియాఅన్న భ్రమ కలుగుతుంది. లేక మొగలాయీలనాటి వాతావరణమూ సంప్రదాయమూ కళ్లకుగట్టినట్లు కనిపిస్తుంది. మధ్యతరగతి కుటుంబీకులూ, బీదవారూ ఆనందించేందుకు యిక్కడ ఏమీ సాధనం లేదు. మరీధనవంతులు యిక్కడ అమెరికా చూస్తారుట. హుస్సేన్‌సాగర్ దాటి జంటనగరంలోకి అడుగుపెడితే మనుషులు లేని పాశ్చాత్యదేశాల రోడ్లవంటిరోడ్లు. ఇంకా అందం తరచబోదామని లోపలకుపోతే అసలు నరసంచారమే లేదు. ఇన్ని విభిన్నమనస్తత్వాలతో, రకరకాలకులాల స్వంతపద్ధతులలో, బురఖాలు వేసుకుని యింకా తిరుగుతూన్న రస్తాలలో ప్రతిచోటా యీనాడు ఎక్కడకు పోయినా తాండవించే నాగరికత కొంతభాగం పంచుకుంది. నాగరికత! అసభ్యకరమైన ఒక అంశాన్ని ధైర్యంతో బాహాటంగా ప్రదర్శించటమేతప్ప నాగరికత మరొకటికాదని అచ్యుతరావు అర్థం చెప్పుకున్నాడు.

నాలుగురోడ్లమధ్య నిలబడివున్న బీట్ కానిస్టేబిల్ అతనికి తెలిసినవాడు అవటంచేత శాల్యూట్ చేశాడు. ఎవరికో 'పాన్' అందిస్తూన్న కిల్లీకొట్టు దమ్మిడీలు గౌరవపురస్సరంగా నవ్వాడు. మరుక్షణంలో వీళ్ళిద్దరినీ చూసి జాలిచెందటం ప్రారంభించాడు అచ్యుతరావు. పాపం ఏంజీవితాలు వాళ్లవి? ఆకానిస్టేబుల్ అదేజాగాలో ఎప్పుడూ నిలబడి వికృతంగా చేతులు అటూయిటూ ఆడిస్తూ ఎవరిదారిన వాళ్ళను సాగనంపాలి? చలివేస్తే ఓవర్‌కోటు వేసుకునీ, వానవస్తే గొడుగువేసుకుని ఆ అల్పత్వానికి గురిఅవుతూ ఆ నరకబాధ అనుభవిస్తూ వుండాలి. కిల్లీకొట్టుదమ్మిడీలుకూడా అంతే. పొద్దుట ఎనిమిదింటికి తెరిచినషాపు, రాత్రి పన్నెండింటివరకూ ముయ్యక అలా ఎందరికో ఆకులు చుట్టియిస్తూ, సిగిరెట్లు అందిస్తూ, బూతుమాటలుమాట్లాడుతూ దుర్భరజీవితం గడుపుతూంటాడు. పాపం! ఆశ్చర్యం! వాళ్ళజీవితాలు హేయమైనవని వాళ్ళకు తెలియదు. వాళ్లు ఇతరుల సానుభూతి వక్రమార్గంలో చూరగొంటున్నామని వాళ్లకు తెలియదు. వాళ్ళకు ఆత్మవిమర్శనా జ్ఞానం లేదు. వాళ్ళమీద వాళ్లు జాలిపడరు.

తను! మరితను! తనగురించి తనకు తెలిసినంతబాగా ఎవరిని గురించీ ఎవరికీ తెలియదు. అంతేగాక తనకు యితరులగురించి కూడా క్షుణ్ణంగా తెలుసు. ఆ మాదిరి మనుషులు తననిచూసినప్పుడుఏమనుకుంటారు. ఆయనకు ఒక బాధ్యతలేదు. ఆహా, జీవితమంటే ఆయనదే అనుకొంటారు. ఆఁ అప్పుడు మాత్రం తాము అసూయతో, బాధతో కుళ్లిపోతారు. అసలు వాళ్లెవరూ వాళ్లని గురించి తెలుసుకునేందుకు ప్రయత్నించరేం? అతను గర్వపడ్డాడు. తనలాగా ఆలోచించడం ఎవరికీ చేతకాదు.

తన జీవిత విధానం పట్ల అచ్యుతరావుకు చాలా విశ్వాసమూ, తృప్తీ వున్నాయి.

తాను రిక్షా ఎక్కడు అందరిలాగా.

ఉద్యోగం చేయడు.

హోటళ్ళలోంచి కడుపునిండా మేసి, త్రాగి బయటకు వస్తూన్న అనేకమంది విచిత్ర జీవుల్ని, మేయటానికి, త్రాగటానికి, లోపలకు పోతూన్న వందలకు వందలు పౌరుల్ని అచ్యుతరావు చూశాడు.

అబ్బ! రోత.

హోటళ్ళలో తినేవాళ్లని బయటనుంచి చూస్తే వాళ్లంతా ఎవరి దారిన వారు ఎగబడి తింటూన్నట్లు కనిపిస్తుంది. ఎంతమంది తింటారో అంతమంది జనాభాలో కూర్చుని. ఒకరు తిన్న పళ్లాలలో ఒకరు తింటారు. కొన్ని వేలమంది తృప్తిగా చప్పరించి. వేసిన చెంచాలను పెదవుల మధ్యగా నోటిలోకి పోనిచ్చి, నాలికతో పట్టు చిక్కించుకుని చప్పరిస్తారు. పాకంలో చేసిన తీపిపదార్థాలూ, సాంబారంటారే అదీ తింటున్నప్పుడు త్రాగుతున్నప్పుడు చూడాలి. పోనీ ఎవరిదారిన వాళ్లు తిని ఊరుకోక ఒకరి ముఖంవంక ఒకరు తేరిపార చూసుకోవటమూ, వాడింకా చూస్తున్నాడా అని వీడూ విడింకా చూస్తున్నాడా అని వాడూ...

ఇలా చీదరించుకోవటంతో తన కసినంతా తీర్చుకుని అక్కడినుంచి దాటాడు.

తన ప్రవర్తనకు వన్నె తెచ్చే మరో విషయం. తాను హోటళ్లచుట్టూ తిరగడు.

అదే తలుచుకుంటూ, గర్వ పరవశుడౌతూ బస్‌స్టాండ్ దాటికొంతదూరం పోయే సరికి ఒక సినిమా హాలులో విపరీతంగా జనం త్రొక్కిస లాడుకుంటూ వుండటం, కుమ్ముకోవటం దృగ్గోచరమైంది. ఈ రోజే మొదలైనహిందీ సినిమా చూడటం కోసం జనం తండోపతండాలుగా వచ్చారు. ఒకడు అక్కడున్న బొమ్మలని

చూస్తూ, యిదివరకు పత్రికలో చదివిన కథను గుర్తు తెచ్చుకుంటూ 'అప్పుడు వాళ్ళిద్దరూ' లవ్ లో పడ్డారు. అని ప్రక్కవాడికి వివరిస్తున్నాడు. భార్యాభర్తల మోస్తరు వున్న యిద్దరు రిక్షాలోంచి దిగగా, మొగవాడు కిల్లీ నములుతూన్న ఆడదాన్ని 'నువ్విక్కడే నిల్చోమ'ని చెప్పి తాను లోపలకు పోయి మందలో కలిశాడు. ప్రతి కొత్తసినిమాకీ మొదటి రోజునే హాజరయ్యే ఒక కాలేజి అమ్మాయినిగురించి యిద్దరు అబ్బాయిలు వ్యాఖ్యానించుకుంటున్నారు. పిల్లల తల్లులు ఎందుకొచ్చామా అని విసుగుకుంటున్నారే కాని కదలనన్నా కదలరు. ఈ దృశ్యాలన్నీ అచ్యుతరావు చూశాడు. భరించలేక పోయాడు. కదిలి ఆ వాతావరణం దాటిబయటపడ్డాక "అమ్మయ్య" అని హాయిగా ఊపిరి పీల్చుకున్నాడు.

తనకు ఘనత నాపాదించే మరో విషయం. సినిమాలు ఎప్పుడోగాని చూడడు.

హఠాత్తుగా తన ముందు లోకం ఎంత అనిపించింది. ఇంకా ఏమో అనిపించబోతుండగా ప్రక్కనించి వేగంగా దాటిపోతూన్న రిక్షాలోని ఓ వ్యక్తి "ఏమండోయి అచ్యుతరావు గారూ" అని పేరు పెట్టి పిలవటం వినిపించింది. అయినా అతను ఆగలేదు. తలత్రిప్పి వెనక్కి చూడకుండా, మామూలుగా నడవ సాగాడు. ఆ పిలిచింది ఎవరో తనకు తెలుసు. అతనలా వాహనం మీద, అదోదర్జా అనుకుని కూర్చుని కుశల ప్రశ్నలు వేస్తూండటమూ తను నిలబడి సమాధానాలు చెబుతూండటమూనా? అచ్యుతరావు బ్రతికివుండగా అటువంటి పొరపాటు పని ఎప్పుడూ చేయడు.

అతనికి ఆనందం కలిగింది. తనలో ఏదో ప్రత్యేకత వుంది. అది ఎవరూ అందుకోలేనిది. తాను దేనినో సాధించాడు.

ముందుకు సాగాడు. ప్రజలంతా ఎక్కడికో పని వున్నట్లుగా గుంపులు గుంపులుగా పోతున్నారు. ఈ ఊర్లో వున్న బ్రహ్మాండమైన విచిత్రం యిది ఒకటి. సాధారణంగా పండగ వస్తే కొత్త బట్టలు కట్టుకుంటారు. శుభ్రంగా పలహారాలు చేసుకు తింటారు. సరదాగా వుంటారు. ఇక్కడ అదేమీ కనపడదు. మనుషులంతా రోడ్లమీదకు వచ్చేసి క్యూ సిస్టమ్‌లో నడిచినట్లు వరుసగా నడిచిపోతూ వుంటారు మాట్లాడనైనా మాట్లాడుకోకుండా.

"...ఆంధ్ర జీవితములో ముఖ్యపాత్ర వహిస్తున్నది."

పెద్దరంగుల గుడ్డ మీద గుండ్రని అక్షరాలతో లిఖించబడి వేళ్లాడగట్టబడి వుంది ఒకచోట...ముసిముసిగా నవ్వుకున్నాడు. తర్వాత జాలిపడ్డాడు. ఇదంతా ప్రకటన చాతుర్యం. చాపల్యం. ఆమాటకు వస్తే ఏది ఆంధ్ర జీవితములో ముఖ్యపాత్ర వహించటలేదు గనుక? "ఆవకాయ"...అతడి పెదవుల మీద కొంటె తనంతో కూడిన చిరునవ్వు చిందులాడింది. కొంటెగా ఆలోచించటంలో కూడా తాను మొనగాడు. ఈమధ్య తనకు తెలిసిన ఓయువకుడు వున్నట్లుండి కోలినాస్ చిరునవ్వులు విరజల్లటం ప్రారంభించాడు. ఒక మిత్రుడిలాంటి వాడు యిల్లు కట్టడం ప్రారంభించి వూరికినే జాప్యం చేస్తూంటే "హార్లిక్సు తాగవయ్యా"అని సలహా యిచ్చాడు తను. ప్రతి పత్రికా తప్పని సరిగా చదివే తన ప్రక్కయింటి వాళ్ళ కుర్రాడిని అడిగితే ఏసినిమా తారకు ఏ సబ్బు చర్మ సౌందర్యాన్నిస్తుందో, ఏతలనూనె తెల్లజుత్తుని నల్ల జుత్తుగా మారుస్తుందో, మరి ఏతలనూనెజుత్తునివొత్తుగా పెంచుతుందో గడగడ వల్లించగలడు.

తన తెలివి తేటలకు మరో నిదర్శనం. ప్రకటనలు చూసి ఎప్పుడూ మోసపోడు.

ఇంతలో "అచ్యుతరావుగారూ" అని ఎవరో పిలిచారు.

అతను ఆగాడు. ఆగినందుకు చిరాకు పడుతున్నట్లుగానే ముఖ భంగిమ ప్రదర్శిస్తూ నిలబడ్డాడు.

రామనాథం అనే నలభయి ఏళ్ళ ఆయన ప్రక్కనుంచుని ఎవరితోనో మాట్లాడుతున్న వాడల్లా దగ్గరకు వచ్చి "నమస్కార మండీ" అన్నాడు. అచ్యుతరావు తప్పని సరిగా ప్రతి నమస్కారం చేసి ప్రశ్నార్థంగా చూశాడు.

ఆయన నవ్వటానికి ప్రయత్నిస్తూ "ఎక్కడిదాకా బయల్దేరారు"? అన్నాడు. అచ్యుతరావు ముభావంగా సమాధానం చెప్పాడు. ఆయన అష్టకష్టాలుపడుతూ ఏదో అడగటానికి శాయశక్తులా తంటాలు పడుతున్నాడు. చిరుగు చొక్కాతోనూ, మోకాళ్ళపైకి ఎగసిన పంచెతోనూ, చెప్పులులేని కాళ్ళతోనూ, మాసినగడ్డంతోనూ, తైలసంస్కారం

లేని జుట్టుతోనూ వున్న ఆయన అచ్యుతరావు యింటికి కొద్దిదూరంలోవున్న చిన్న పెంకుటింటిలో నివసిస్తూన్న వ్యక్తి. తడబడుతున్న కంఠంతో నే ప్రస్తావనగా కొన్ని ప్రశ్నలు అడగసాగాడు లాంఛన ప్రాయంగా. అచ్యుతరావు ముఖంలో నిర్లక్ష్యాన్ని వ్యక్తంచేశాడు. చివరకు ఆయన రెండు చావునవ్వులు నవ్వి వాలిపోతూన్న ముఖాన్ని వాలిపోకుండా వుంచేందుకు ప్రయత్నిస్తూ 'ఒకపాతికరూపాయలుంటే సర్దుబాటుచేస్తారా. మా అయిదోదానికి చాలాజబ్బుగా వుంది' అంటూ నసిగాడు.

అతనుముఖం చిట్లించి "క్షమించండి. నాదగ్గర లేవు" అని మొహమాటం లేకుండా చెప్పేసి వస్తాను. అని అక్కడినుంచి వచ్చేశాడు.

ముఖపరిచయం వున్నంతమాత్రాన డబ్బు అప్పు అడుగుతాడా యీ పెద్దమనిషి? తనమాట సత్తా ఎంతో తెలుసుకోవాలి నోరు జారేముందు. అసలు డబ్బు అప్పుయిచ్చే వాళ్లైనా పుచ్చుకు నేవాళ్ళైనా తనకు పరమ అసహ్యం. మానవత్వం చంపుకోవటానికి మరోపేరు యీ రెండిట్లో ఏదైనా ఒకదానికి.

ఈయనగారికి తొంభయి రూపాయల జీతం. మొదటిభార్య చనిపోయేటప్పటికే నలుగురు సంతానం. నోటిలోకి నాలుగువేళ్ళూపోవు. మరో పెళ్ళి వెలగబెట్టి అయిదోపిల్లను కన్నాడు. ఆభార్యకు టి. బి. మరి డబ్బు చాలమంటే ఏంచాలుతుంది? ఈ మనుషులు పెళ్ళి విషయంలోయెందుకు యింతబుద్ధిహీనంగాప్రవర్తిస్తారో అర్థంకాదు. తనకు కాలుమీద కాలువేసుకుని తిన గలిగినంత ఆస్తివుంది. ముప్పయిఏళ్ళు. అయినా యింత వరకూ పెళ్ళిమాట తలపెట్టలేదు. నిర్విచారంగా రోజులు గడుపుతున్నాడు.

అద్భుతమైన మరోసుగుణం. అందరిలా తను పెళ్ళి చేసుకుని ఆ రొంపిలో, బాదరబందీలో పడలేదు.

ఓహో! తనలో ఎన్నిసుగుణాలు! ఎంతగొప్ప లక్షణాలు!

ఒకదానిని మించింది మరొకటి. ఒకదానికన్న ఉన్నతమైనది మరొకటి. తను యీ ప్రపంచానికి ఒక ఆదర్శప్రాయుడు. తననిచూసి ప్రతివాడు అలా నేర్చుకోవాలి.

దేవుడు ఒక అపూర్వవ్యక్తిని సృష్టించి "యితరులు వేలెత్తి చూపటానికి యితనిలో దోషాలేవీ లేకుండా వుండుగాక" అన్నాడు.

అంతే అతనే అచ్యుతరావై పోయాడు.

సహాయం. మానవులు ఒకరినొకరు సహాయం కోరుతారు. పరిధులు దాటతారు. ఆశలనుపెంచుకుంటారు. ఆశలను త్రెంచుకుంటారు.

మొన్న తనకు వేలువిడిచిన మేనమామ కొడుకు నాతానని చెప్పుకుంటూ ఒకయిరవై ఏళ్లి కుర్రవాడు యింటికి వచ్చాడు.

అతను ఎవరు? ఈ మధ్య దేశంలో ఎక్కడా చెల్లుబడికానివాళ్లూ, అణాకానికి పనికిరానివాళ్ళూ యీ హైదరాబాద్ నగరంలో ఓ ఉద్యోగాలు దొరగబడతాయని తంబలు తంబలు తరలి వచ్చారు. ఎవరో ఒక పరపతిగలవాడిని ఆశ్రయించారు. ఇహ అన్వేషణ సాగించారు.

"బావా! ఇక్కడ ఉద్యోగాలు బాగాదొరుకుతాయిటగా. అన్నాడతను ఉషారుగా.

"ఆఁ దొరికేవాళ్లకు దొరుకుతూనే వుంటాయి"

"నువ్వేమి ప్యాసయినావు?"

"ఇంటర్మీడియట్ పార్ట్ వన్ పోయింది. నేనిహ దాన్ని కంప్లీట్ చేయదలచలేదు. నువ్వున్నావు గదా అనియిలా బయల్దేరి వచ్చాను. నెలకు ఓ నూటయాభై చాలు బావా. ప్రైవేటు కంపెనీ అయినా పరవాలేదు. ఏమంటావ్?"

తాను మొహమాట పడటం చేతకాని వాడు గనుక యిలా నిష్కర్షగా చెప్పేశాడు. "అబ్బాయ్! నూటయాభై చాలా? బలేవాడివే. ఈ దేశంలో అన్ని వూళ్లలోకంటే యీ వూళ్లో ఎక్కువగా ఉద్యోగాలు దొరకటల్లేదు, దొరికేవాడికి ఎక్కడైనా దొరుకుతుంది. పైగా యిక్కడ క్రొత్త ప్రభుత్వం వచ్చాక యిది వరకు అర్హతలు చాలకపోయినా ఉద్యోగాల్లోకి తీసుకున్నవాళ్లని వూడశెరికేస్తున్నారు కూడా. నాకు పరపతి వుంది నిజమే. కాని యిలా ఉపయోగించలేను. కావాలంటే నువ్వు రెండు నెలలపాటు యీ యింట్లో వుండు. తిను "నీకు చాతనైతే వెదుక్కో. నేను మాత్రం సాహాయ్యం చేయలేను."

అతని మొహం కందగడ్డలా అయింది. ఆరాత్రే చెప్పాపెట్టకుండా వెళ్లిపోయాడు.

"సహాయం. వీళ్లకు ఎందుకు బుద్ధిలేదో, తమ పరిమితి తెలుసుకోకుండా ఒకరిపై ఆధారపడకూడదని. అయినా ఏంజీవులు వీళ్లు? మామూలుమనిషికి కావలసిన లక్షణాలు వీళ్లకులేవు. చూడగా తనకు తప్ప మరెవరికీ లేనట్లున్నాయి.

ఈవిశాల ప్రపంచంలో తలకొక రీతిగా బాధ పడుతూ యింతలోపభూయిష్ఠంగా అనవరతమూ మనుషులు మగ్గిపోతూ ఎలా జీవిస్తారో విచిత్రం. ప్రకృతిఅనే త్రాసులో తనను ఒకవైపు నిలబెట్టి, రెండవవైపు మానవలక్షణాలను మానవునికి పనికివచ్చే అంశాలను పడవేస్తే బరువు ఎటూ మొగ్గకుండా సరిగ్గా సరిపోతుంది. ఆస్థానే తనుగాక మరెవరినైనా నిల బెడితే ఎటువైపో ఒకవైపు వాలిపోతుంది.

ఇది హేయ ప్రపంచం. కుళ్లు ప్రపంచం, బాధల ప్రపంచం, తప్పుల ప్రపంచం, దోషయుత ప్రపంచం.

తాను ప్రేక్షకుడు!

ప్రొద్దున్నే లేస్తారు. గడబిడగా కాలకృత్యాలు ముగించుకుంటారు. నోట్లో యింత అన్నం కుక్కుకుంటారు. సైకిళ్ళమీద, సైకిలు రిక్షాలమీద, గుద్దుకుని కుమ్ముకుని సిటీబస్సులమీద ఆఫీసులకు పరిగెడుతారు. చివాట్లు తింటారు అధికారులచేత. తప్పుపనులు చేస్తారు. దొంగలెక్కలు వ్రాస్తారు. 'డిస్టిల్ వాటర్' యిచ్చి అయిదు రూపాయలు జేబులో వేసుకుంటారు. కేసు గెలిచినా ఓడినా డబ్బు వసులుచేస్తారు. అప్పుల కోసం ఎగబడతారు. ఒకరినొకరు పొగుడు కుంటారు. తెగడుకుంటారు. మంచినీళ్ళ పంపుల దగ్గర యుద్ధాలు చేసుకుంటారు. నీతితప్పి చరిస్తారు. ఇళ్ళల్లోంచి బయటకు వెళ్ళ గొట్టించుకుంటారు. పనికిరాని పిల్ల కాయలకు పిల్లలనుయిచ్చి మురిసి పోతారు. ఈగలతో, దుర్వాసనతో నిండివున్న కొండల్లో దేకుతారు. అతి మధుర సన్నివేశంలో కూడా తమ ఉద్యోగాన్నీ, బాధ్యతనూ తలపుకు తెచ్చుకుని 'అమ్మో' అని కుమిలి పోతారు. రోగాలతో, వేదనలతో అఘోరిస్తారు. చీట్లపేకలు ఆడతారు. డ్యూటీపేరిట నడిరోడ్డుమీద నగుబాటు అయేపనులు చేస్తూంటారు. పరస్త్రీలకోసం వ్యామోహ పడతారు. తాగుతారు తందనాలు ఆడుతారు...అబ్బ! దుర్భరం!

బాగా చీకటిపడి పోయింది. క్రమంగా పెద్దపెద్ద వీధుల్లోని దీపాలు తీర్చిదిద్దిన వరసలుగా దూరాన సందుల్లోకి దృగ్గోచర మౌతున్నాయి. అచ్యుతరావు ఒక సందులోంచి నడుస్తున్నాడు. మనుషుల సందడి అంతగాలేని అమాసకచీకటి. సందులో మెల్లగా అడుగులు వేస్తూ నడుస్తూ ఒక పెంకుటింటికిటికీ ముందు నడక వేగం మరీ మందంచేసి అటూ ఓరగా చూశాడు.

కిటికీవున్న గదిలో ఓదీపం వెలుగుతోంది. ఇతరులకు స్పష్టంగా కనిపించేటట్లుగా ఓ స్త్రీ కూర్చుని వుంది అటుకేసి. అచ్యుతరావును చూసి చిన్నగానవ్వి అవ్యక్త ధ్వనితో ఏదో పలికింది. అతను వినిపించుకోకుండా తలప్రక్కకు త్రిప్పుకుని నడిచాడు ఠీవిగా. అతని పెదవులు చిన్నగా హసించాయి.

తాను...తాను అతి నిగ్రహశాలి. స్త్రీజాతి మీద లాలసలేదు. తాను ఎవరికీ దాసోహం అనడు.

తన జన్మ ధన్యమైంది.

ఒక ఫర్లాంగు నడిచాక అచ్యుతరావు ఆగి చుట్టూరా చూశాడు. అంతా చీకటిమయం. ఆ పెద్ద వీధుల్లోని దీపాలుకూడా యిక్కడకు కనబడటంలేదు. ఈ ఏకాంతంలోని ప్రశాంతంవల్ల తన నిర్మలత్వానికి బంగారానికి తావి అబ్బినట్లుగావుంది. అసలు సృష్టిలోని రహస్యం యిదే. బాధాపూరిత మనుషులమధ్య, పెనుచీకటి పేలికలమధ్య ఎవరూకాననిచోట హఠాత్తుగా శాంతీ, వెలుగూ వుంటాయి. అది ఆరాతీసి సమీపించగలిగినవాడు అదృష్టవంతుడు. తానే మేధావి.

అతను నిశ్చింతగా నిట్టూర్చి చుట్టూ మళ్ళా కలయచూశాడు.

ఇవి అసహ్యమూ, దరిద్రమూ తాండవించని ధనవంతుల మేడలనీడలు. ఇది సుఖభోగలాలసులైన వ్యక్తుల మలినచరణాలచే తొక్కబడని ఒక మారుమూల ప్రదేశంలోని నిర్జనభూమి. వివిధభోగపరాయణులు నిర్లక్ష్యంగా స్పృశించని అడివిలాంటి పట్టణ భాగం.

తనకెందుకో యీ జాగా చూస్తేనే ఒక అపూర్వ నేస్తాన్ని చూసినంత ఆప్యాయతగావుంటుంది.

ఇక్కడ పచ్చిక లేదుగాని వుంటే విశ్రమించాలని వుంటుంది.

దీనికి కారణం ఎప్పుడో తెలిసింది. కల్మష యుత, దుఃఖసమిశ్రిత, అసహ్యాభరితమైన అన్ని వీథులు, బజార్లు దాటాక యిహ దీనిపైన నరసంచారానికి తావులేదు. అడ్డుగా పెద్దగోడవుంది.

ఆ గోడనానుకుని అచ్యుతరావు క్షణంపాటు కనులుమూసుకున్నాడు. ఇది అన్నిటికి అతీతమైనది. ఎవ్వరూ తన అంతస్థు స్పృశించలేనిది.

ఇహచాలు. ఇదే అతని 'టెర్మినస్' అతను వెనక్కి తిరిగాడు. ఒక అవ్యక్త ప్రబోధనతో మన సంతా మగతనిండి, నేత్రాలు ఉజ్వలంగా ప్రకాశిస్తున్నాయి.

తాను అతీతుడు. కోర్కెలను, మానవ బలహీనతలను అవలీలగా అతిక్రమించినవాడు.

వందిగజాలు గడిచాయి. అక్కడ ఒక స్ట్రీట్ లైటు వుంది. ఎడమవైపుసందు మలుపుతిరిగి ఓ వ్యక్తి నడిచి వస్తూ అచ్యుతరావుకు అక్కడ కనిపించాడు, సరిగ్గా దానివెల్తురులోకి వచ్చేసరికి ఆ వ్యక్తి తనలోతను ఏదో మాట్లాడుకుంటున్నాడు. గాలిలో చేతులు తిప్పుతున్నాడు. తీవ్రంగా గొణుక్కుంటున్నాడు. పైగా ఆపనివల్ల ఏదో ఆనందం అనుభవిస్తున్నట్లుగా గోచరిస్తున్నాడు.

"ఆత్మారావు! ఏ లోకంలో విహరిస్తున్నావ్!" అంటూ అచ్యుతరావు అతన్ని ఎగతాళిచేస్తూ ఆపాడు.

అతను ఉలుకుపడి, యితనివంక తేరిపార చూసి "నువ్వా?" అన్నాడు.

"నేనే యిలా ఎక్కడికి?"

అతను ఆశ్చర్యపడి "అవును నేను యిలా ఎందుకు వచ్చాను? వుత్తర్ ఘట్టేకి బయల్దేరాను" అన్నాడు.

అచ్యుతరావు అతన్నిచూసి జాలిచెందాడు. "నువ్వీ అలవాటు మానుకోవాలోయ్"

"ఏ అలవాటు?"

"నీకు ఏవో బాధలు, ఆవేదనలు వున్నాయని నాకు తెలుసు. కాని వాటినుంచి విముక్తుడివి కావటానికి ప్రయత్నించాలి. అనుక్షణం ఆలోచిస్తూ, తనలోతను మాట్లాడుకుంటూ, చేతుల్ని గాలిలో త్రిప్పుతూ సతమతమయ్యే ఒక మనిషివున్నాడంటే నాకు నవ్వొస్తోంది. నీ జీవితం, ప్రవర్తన యితరులకు ఎంత హాస్యాస్పదం! నీలాంటి వాళ్ళు ఎలా బ్రతుకుతారో నాకర్థం కాదు. ఆశ్చర్యంగా వుంటుంది"

"నాలాంటివాళ్ళు ఎలా బ్రతుకుతారో నీకు ఆశ్చర్యంగా వుంటుందా?" "అవును మీరు నార్మల్ మనుషులు కానందుకు. అవివేకాలకు లోనవుతున్నందుకు"

ఆత్మారావు కళ్ళు ఒక్కసారిగా ఎర్రబడ్డాయి. "అచ్యుతరావ్!" అన్నాడు. "ఇతరులలెవరికీ లేని ప్రత్యేకత నీలో ఏదో వుందని నీవు చాలా కాలంగా అనుకుంటున్నట్లు నాకు తెలుసు. నాలాంటివాళ్ళంటే ఏదో చులకన భావంతో మిడిసి పడుతున్నావని నీ మాటలవల్ల పెనకసార్లు గ్రహించాను. జీవితంతో పోరాటంచేసేవాడిని చూస్తే బాధ్యత, బరువు తెలియని నీలాంటి వాడికి యీ కబురు చాలాకాలంగా చెబుదామనుకుని కూడా మామూలు మనిషిని కాబట్టి "ఎందుకులే"అని వుపేక్షిస్తూవూరుకున్నాను. నన్ను చూస్తుంటే నీ కాశ్చర్యంగా వుందా? పాపం: నిన్ను చూస్తుంటే మా అందరికి ఎంత ఆశ్చర్యంగా వుంటుందో, మేమంతా ఎంత వెక్కిరించుకుంటామో నీకు తెలియదు. ఎలా తెలుస్తుంది? నువ్వెప్పుడూ లోకులనిగురించి ఆలోచించటమే గాని, నీగురించి లోకులు ఏమనుకుంటున్నారో ఎప్పుడైనా వింటేనా? ఇహమీదట ఆ సావకాశం కలిగించుకో. కాస్త నీ గురించి ప్రజలేమనుకుంటున్నారోకూడా విను. నీకేమైనా బోధపడుతుంది" అని యిహ అక్కడ ఆగకుండా వెనక్కి తిరిగి గబగబ వెళ్ళిపోయాడు.

అచ్యుతరావు నివ్వెరపోయాడు? ఇదేమిటిది? ఈ ఆత్మారావువచ్చి విచిత్ర విషయాలు చెప్పిపోయాడు. తన తీర్మానం, దృఢ విశ్వాసం అవన్నీ పటాపంచలు చేశాడేం? అబ్బే! యివి నమ్మశక్యంగాలేవు. కాని యీ మూర్ఖుడు చాలా ఆవేశంలో పలికిపోయాడు, మూడాలి.

అసలు అతనికి తనమాటలకు ఎదురుజవాబు చెప్పగలిగే సామర్థ్యం వుంటుందని అనుకోలేదు. అలా చేయటమేగాక దబాయించాడు.

అతను మెల్లిగా ఆ కిటికీని సమీపించాడు. ఓరగా చూశాడు. ఆ స్త్రీ యింకా అలానే కూర్చుని బయటకు చూస్తోంది. మళ్లా అవ్యక్త ధ్వనితో ఏదో అంది.

అచ్యుతరావు మందంగా సాగాడు. సంతృప్తి పడబోయాడు. తను, తన నిగ్రహం...ఓహో! కాని ఆత్మారావు అన్న మాటలు గుర్తుకు వచ్చాయి...ఆమె ఏమిటో అంటున్నట్లుగావుంది. ఆలకించాలి. అతను ఊపిరి బిగించాడు. ఆమె చాలానిరసనగా, హేయమైన భాషలో...చాలు...అతను విన్నాడు.

అచ్యుతరావుకు తల తిరిగింది. తనేనా భూమ్మీద యింతమాట పడింది. ఆమెకేమైనా మతిపోయిందా? తన నిర్లక్ష్యానికి, నిగ్రహానికి ఎటువంటి అర్థం తీసి పరిహసించింది? పైగా పెద్ద శబ్దంతో కిటికీ తలుపులు మూసుకుంది.

ఛీ! ఎంతమాట అన్నాడు! ఈ స్త్రీకి కొంచమైనా బుద్ధిలేదు.

కాని...!

ఆత్మారావు చెప్పిన మాటలు? తన గురించి లోకంలో కొందరు యిట్లాకూడా అనుకుంటున్నారా?

తడబడటం. కొత్తగా అలవర్చుకున్న అడుగులతో ముందుకు సాగాడు.

చీకట్లో యిద్దరు మనుష్యులు యెదురుగా వచ్చారు. ఇతన్ని ఎగాదిగామాసి ప్రక్కకు తప్పుకుని గుసగుసలు చెప్పుకున్నారు.

అచ్యుతరావు వీనులకు ఆగుసగుసలు యీవిధంగా సోకాయి, ఎన్నడూ విననంత శ్రద్ధగా వినటంచేత.

"వీడిపేరే అచ్యుతరావంటే, పిల్లికి బిచ్చం కూడా వేయడు...చస్తే ఒకడికి సహాయం చెయడు."

ఈ యిద్దరికి కూడా మతులు పోయినట్లున్నాయి. లేకపోతే అట్లా ఎందుకు చెప్పుకుంటారు?

అతని మనసు సందిగ్ధమైంది. ఉద్విగ్నమైంది, "పాపం వీళ్ళు అమాయకులు" అనుకున్నాడు. ఆత్మారావు చెప్పిన మాటలు గుర్తుకు వచ్చాయి. దుర్మార్గుడు నిజం చెప్పాడేమిటి కొంపతీసి...!

అచ్యుతరావుకు కొద్దిగా శరీరం చమర్చింది. బాధపడ్డాడు.

కాని ఈ విధంగా బాధపడటమారంభించటానికిది ప్రథమం. బయటి ప్రపంచంనుంచి చీకటి ఆ విషయాన్ని దాచింది.

మెల్లగా విశాలమైన వీధుల్లోంచి నడవసాగాడు. నడకలో కొద్దిగా ఠీవి తప్పింది. తనని రాసుకుపోతూన్న ప్రతివాడూ తన గురించి ఏమయినా చెప్పుకుంటున్నాడేమోనని చెవులు రిక్కించి వినసాగాడు. తాపత్రయపడుతున్నాడు. ఆశాభంగం చెందుతున్నాడు. మళ్ళా ఏదో గండం తప్పిందికదా అన్న అవ్యక్తపు సంతోషం.

పాడు పాడు కార్లతో, పిచ్చి పిచ్చి సైకిళ్లతో, చెత్త చెత్త రిక్షాలతో, వెర్రిమొర్రి మనుషులతో నిండివున్న బజార్లలో పడి వెనక్కి నడిచి వస్తున్నాడు అతీతుడు అచ్యుతరావు.

సినిమాహాలు సమీపించాడు. ఇందాకటి సందడి తగ్గినా సెకండుషోకోసం అప్పుడే కొంతమంది జనం పడిగాపులు కాచుకు కూర్చున్నారు.

అచ్యుతరావుకు కాళ్లు వణికాయి.

వాళ్లంతా తనని చూసి నవ్వుతున్నట్లు అనిపించింది. వెక్కిరిస్తున్నారేమో. ఆత్మారావు మాటలు గుర్తుకువచ్చాయి. చెవులు రిక్కించి వినాలి. క్షణంలో మారిన తన మనసుతో సాధన చేయాలి.

"వాడు వున్నాడే వాడు. అచ్యుతరావు. చస్తే సినిమాలు చూడడు. ఒక్క సినిమా పాటరాదు. ఒక్క సినిమాస్టార్ పేరు తెలియదు. చవట."

అబ్బే! ఇది కేవలం తన భ్రమ. ఎవరూ యీ మాటలు అనటంలేదు. తను అపోహ పడుతున్నాడు. అక్కడున్న వాళ్ళలో ఒక్కడికి తను తెలియదు.

కాఫీ హోటళ్ళలో జనం యింకా ఎగబడి ఉంటున్నారు. అస్తవ్యస్తంగా వున్నారు. తల త్రిప్పి హోటల్ ప్రొప్రయిటర్ ముఖంవంక చూశాడు. అదే సమయానికి అతనూ యితనివంక చూశాడు.

అచ్యుతరావు ఆచూపు భరించలేకపోయాడు. తల ప్రక్కకి త్రిప్పేసుకున్నాడు. ఆ చూపు ఎంత ఎకసెక్కంగా వుంది; వాళ్లంతా చూడు ఎలా తింటున్నారో; ఎంత సరదాగా వున్నారో! నువ్వో? వొట్టి దేబానివి. అన్నట్టుగా వుంది.

"అబ్బే లేదు. లేదు. అతని చూపులో అట్లాంటి భావంలేదు. కేవలం భ్రమ. భ్రమ" అనుకున్నాడు.

"అబ్బే కాదు. నిజమే" అనుకున్నాడు.

"అబ్బే అసలువాడికీనాకూ ఏం సంబంధం. నేనెవరో వాడికి తెలియ నే తెలియందే" అనుకున్నాడు.

అచ్యుతరావుకు హఠాత్తుగా మనస్సు ఎదురు తిరిగింది.

"ఛీ నేనెందు కింత హీనంగా ఆలోచిస్తున్నాను? నేనెక్కడ? వాళ్లు ఎక్కడ? నాస్వభావం ఎక్కడ? వాళ్లి స్వభావం ఎక్కడ?" అని సమర్థించుకో ప్రయత్నించాడు.

సమర్థన సమర్థనలాగే వుంది. మాట నుంచి మాటలు ప్రతిధ్వనించినట్లు "నాస్వభావం ఎక్కడ? వాళ్లిస్వభావం ఎక్కడ?" అని మళ్ళీ వికృతంగా ఆలోచన స్పందించింది.

ఆ తాకిడికి అతను పూర్తిగా అప్రతిభుడయి పోయాడు. "నన్ను నేను ఎంత చులకన చేసుకుంటున్నాను? ఆ మూర్ఖుడి మాటలు సాంకేతికంగా పని చేస్తున్నాయంటే. ఇదంతా కేవలం భ్రాంతి. నేను ఆదర్శప్రాయుణ్ని" అని తనకితాను విన్నవించుకున్నాడు.

పోలీసువాడు పని రద్దీ తగ్గటంతో దమ్మిడీలు దుకాణందగ్గరకు పోయి నిల్చుని ఆకులునములుత్తూ కబుర్లు చెబుతున్నాడు. సమీపంగా వస్తూన్న అచ్యుతరావుని యిద్దరూ చూశారు. గౌరవంగా చేతులుదించారు.

అచ్యుతరావుకు భయంవేసింది. కనీసం వీళ్ళకు అయినా మంచి అభిప్రాయం వుందా?

ఆత్మారావుమాటలు గుర్తుకు వచ్చాయి. శరీరమంతా నీరసం క్రమ్మింది. ఇందాకటిదంతా భ్రాంతి అన్న సందేహం సడిలిపోసాగింది. అసలు తనగురించి వీళ్లేదో చెప్పుకుంటారని ఎందు కనుమానించాలి?... ఎందుకనుమానించకూడదు? వీళ్ళు తననిగురించి ఎందుకు చెప్పుకుంటారు? ఎందుకు చెప్పుకోకూడదు? తాను వినకూడదు, వినాలి.

కాని పాముచెవులు పెట్టుకుని వినక తప్పలేదు.

"అదికాదు దమ్మిడీలూ! ఈయన జీవితం ఏమిటంట? సాయంత్రం అలా వస్తాడు. రాత్రికి యింటికి వెడతాడు? ఒక స్నేహం, జల్సా, కుషీ ఏమీలేదు. డబ్బుండి చేసేదేమి టంట? విడ్డూరం మనిషిలా వున్నాడు."

"ఎవరిపిచ్చి వారి కానందం?

ఈనాడు తన శ్రవణకుహరం ఏం పాపం చేసుకుంది. అతనికి ముచ్చెమటలు పోశాయి. తాను ఎవరిని గురించి నిరంతరం జాలిచెందుతున్నాడో వారిదృష్టిలో తాను హాస్యాస్పదమైన పాత్ర అయ్యాడు. ఈ లోకం అంతా తనను యింత కించపరుస్తూ ఆలోచిస్తూందా?

ఏతలనూనె ఏపని చేస్తుందో గడగడచెప్పే ప్రక్కయింటి వాళ్ళ అబ్బాయీ, పని మనిషి యాదమ్మ కొడుకు వెంకటీ, జింకపిల్లా, వంటవాడు పరమేశం వీళ్ళంతా ఆకస్మికంగా ఒక ఉన్నత స్థానం ఆక్రమించుకుని, అతని హృదయంలో చోటుచేసుకుని బిగ్గరగా నవ్వుతున్నారు. తన కీవి, దర్జా, అంతస్థు, ఊహలు...

విరిగిపోయినాయి, బూడిదలో కలిసిపోయినాయి. అతనికి పార్వతి గుర్తువచ్చింది.

ఆపిల్ల తననుచూసి నవ్వుతుంది. కాని వెక్కిరిస్తూ నవ్వదు. అది కొంటెతనం గలనవ్వే. ఆ కొంటెతనంలో ఎంతో హాయివుంది. అది అనుభవించినవాడు ధన్యతముడు. ఆమె ఇంటికేసి ఆశగా చూశాడు. నిటూర్పువిడిచాడు. ఇంటి తలుపులు వేసివున్నాయి. ముందువిచారం ఆవరించబోయింది. కాని వెనువెంటనే "హమ్మయ్య" బ్రతికాను అనుకున్నాడు.

తన పరిస్థితి యిప్పుడు ఎంత హృదయ విదారకంగా వుంది. వచ్చేదారికీ, వెళ్ళేదారికీ యీ రోజు ఎంత వార కనుక్కోగలిగాడు.

"కహాజాతేసాబ్" అన్నాడు రిక్షావాడు ప్రక్కగా వచ్చి రథాన్ని ఆపుతూ. వీడు సాధారణంగా ఎప్పుడూ అడుగుతూండేవాడే. వీడి యిల్లు యీదరిదాపుల్లో నే ఎక్కడో వుండి వుండాలి.

"అక్కర్లేదు" అన్నాడు కోపంగా తెలుగులో.

"ఏమయ్యవయ్య అయ్యావు! ఒక్కనాడైనా రిక్షా ఎక్కిన పాపాన పోతివిగాదు. డబ్బంతా మూటగడుతువుగాని లే" అని రిక్షావాడు గబగబ త్రొక్కుకుంటూ వెళ్ళిపోయాడు.

అచ్యుతరావు నిర్విణ్ణుడై పోయాడు. ఈసారి వినాలని అనుకోకుండా యీమాటలు విన్నాడు. దుర్మార్గుడు దాటిపోయాడు. ఒక మనిషిని ఒక మనిషి గొడ్డులా లాగడం, రిక్షా ఎక్కకుండా వుండటంలో తన ఆశయం!

ఒక యింటి ముందుకువచ్చాడు. ఆయింటి అరుగుమీద అయిదారుగురు మనుషులు కబుర్లు చెప్పు కుంటున్నారు. యితను రావటం కనిపెట్టి వాళ్ళంతా మాటలు కట్టిపెట్టారు. అచ్యుత రావుకు యీ యిల్లు ఎవరిదో తెలుసు. వాళ్ళంతా తననిచూసి మాటలు ఆపేశారు. అతని గుండె గబగబ కొట్టుకుంది. వీళ్ళు తననుగురించి యేమనుకుంటారో వినాలి. కాళ్ళు నేలమీద నెమ్మదిగా వొణుకుతు న్నాయి. అరుగు దాటుతూ సర్వధ్యానమూ అటే కేంద్రీకరించాడు.

"పోతున్నాడే మనవాడు."

"పోనిద్దూ వాడూ ఒక మనిషేనా?"

"అవునుగాని ఏమిటి వాడి ఉద్దేశం. ఇలా మిగల బెట్టుకొని జీవితంలో ఏం సాధిద్దామని?"

"ముప్ఫయి ఏళ్ళు దాటాయి. యింకా పెళ్ళి పెడాకులూ లేకుండా..."

"పెళ్ళెందుకు? ఊరుందిగా. రోజూ చార్మినార్ వైపు పోయొస్తుంటాడు లే."

"అయినా కొండంత ఆస్తి వున్నప్పుడు పెళ్ళి చేసుకుని కులాసాగా వుండాలి కానీ యిదేం బుద్ధు లయ్యా. పెళ్ళయితే యీపాటికి నలుగురు బిడ్డల తండ్రి అయివుండేవాడు.

"ఇప్పుడు ఎంతమంది బిడ్డల తండ్రయాడో?"

అంతా నవ్వారు బిగ్గరగా. దూరంనుంచి ఇంకా ఏవోమాటలు అస్పష్టంగా వినిపిస్తున్నాయి. అచ్యుత రావు శరీరం తూలింది. కష్టమ్మీద కాళ్ళు స్వాధీనం లోకి తెచ్చుకుని నడవసాగాడు.

అయిదు బిడ్డలని కని పోషించలేక సతమత మవు తూన్న రామనాథం, పెళ్ళాం జబ్బు నయం చేయలేక రోగం ముదరబెడుతూన్న అర్భకుడు రామనాథం, ఈ రాత్రి తను పెళ్ళి చేసుకోలేదని పరిహసించాడు. ఎన్ని రాత్రులనుంచీ పరిహసిస్తున్నాడో. ఇవాళ తను విన్నాడు.

ఒక స్ట్రీట్ లైటు వెల్తురులోకి వచ్చాక తనవేపు సాధ్యమయి నంతవరకూ చూసుకున్నాడు. తానీ వయ స్సులో పెళ్ళి చేసుకోలేదని వాళ్ళకు ఆశ్చర్యమైంది.

హఠాత్తుగా హృదయక్షేత్రంలో సంకులసమరం చెలరేగింది. కాదు. అది సంకులసమరం కాదు. ఒక భయంకర విషాద సన్నివేశం. తనకెవరో వీడ్కోలు యిస్తున్నారు.

వేలమంది యువకులున్న ఒక సభలో అధ్యక్షు డయిన యువకుడు లేచి "ఇవాళ ఎంత విచారకరమైన రోజు! ఇన్నాళ్ళబట్టి అచ్యుతరావుగారు కూడా మన లాంటి యువకాగ్రేసరులు. నేటినుంచీ వారు మన నుంచి దూరమై పోతున్నారు. యువకప్రపంచంనుండి వృద్ధ ప్రపంచంలోకి అడుగు పెడుతున్నారు. వీరు యువకులుగా వుండి మన అందరిలాగే విచ్చలవిడిగా ప్రవర్తించకుండా, బ్యాలెన్సు తప్పి సంచరించకుండా జరలోకి ఒక్కసారిగా వెళ్ళిపోతున్నారు. వారి వీడ్కోలు నిమిత్తం ఏర్పాటు చేయబడిన యీ సభకు అధ్యక్షుడుగా..."

అచ్యుతరావుకు భయంవేసింది. తాను పెద్దవాడై పోతున్నాడు ముసలివాడై పోతాడు. సాధించింది ఏమీ లేదు. పెడదారిన పడ్డాడు. ఘనుడినని తలపోశాడు. అసమర్థుడననీ అవ్యక్తుడిననీ నిరూపించుకున్నాడు. తాను ఎందుకూ పనికిరాడు. ఇంతవరకూ జీవితకాలమంతా వృథా చేశాడు. చివరకూ అందరకూ హాస్యాస్పదమయిన పాత్ర అయాడు. ఆత్మారావు తనకు కనువిప్పు కలిగించాడు. ఇంతవరకూ అందరినిగురించీ ఆలోచిస్తూ, "వీళ్ళంతా ఎట్లా బ్రతుకుతున్నారా?" అని ఆశ్చర్యం చెందాడు. తననిగురించి వాళ్ళంతా వేలెత్తి చూపిస్తున్నారనీ, పదిమందీ కలుసుకుని కూడా చెప్పుకునేందుకు తనలో చెప్పలేనన్ని లోపాలున్నాయనీ గుర్తించాడు ఇప్పుడు. ఇంతమంది నోటిలో పడిన ఈ జీవిత భారం ఎలా మోయటం?

తాను అతీతుడ ననుకున్నాడు. అందరికన్నా మిన్న అనుకున్నాడు. కాని కాదు. తనకెవరూ చిల్లిగవ్వకూడా ఇవ్వటం లేదు.

మూసివున్న గేటుతలుపులు తెరుస్తూంటే చేతులు వణుకుతున్నాయి. తాను అతీతుడు కాదు. కానే కాదు.

ఇంతలో మెరుపులా ఓ ఆలోచన తాకింది. ఒక్కసారిగా ఒళ్ళంతా ఝల్లుమంది. గేటు కిర్రు మంది. తాను అతీతుడే. ముమ్మాటికీ అతీతుడే!